క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



నెల్లూరు (వేదాయపాళెం): నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ (ఎన్టీఎఫ్) క్యాలెండర్‌ను మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. తొలుత మంత్రిని ఎన్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పులి చెంచయ్య శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని గిరిజనుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఎన్టీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఐ బ్రహ్మనాయక్, జిల్లా కోశాధికారి యాకసిరి లోక్‌సాయి, యువజన విభాగ కార్యదర్శి పంతగిరి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు పోట్లూరి మోహన్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



నెల్లూరురూరల్: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ నిజాముద్దీన్ పేర్కొన్నారు. 28వ డివిజన్‌లో రూ.30 లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు డివిజన్ ఇన్‌చార్జి మదన్‌మోహన్‌రెడ్డితో కలిసి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ప్రజలు ఆదరించాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బాలకృష్ణమ్మకు నివాళులు



నెల్లూరు (టౌన్): స్థానిక వెంకటేశ్వర విద్యాలయంలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు మార్పు బాలకృష్ణమ్మ వర్ధంతిని శనివారం నిర్వహించారు. బాలకృష్ణమ్మ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీటీఎఫ్ అధ్యక్షుడు హృదయరాజు, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, గౌరవాధ్యక్షుడు సదాశివరావు, పూర్వ ప్రధాన కార్యదర్శి కులశేఖరరెడ్డి, ఐఫియా ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి, పిచ్చిబాబు, నాయకులు రియాజ్, జుల్ఫికర్, కృష్ణారెడ్డి, శివరాంరెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్షలో పలువురికి షోకాజ్ నోటీసులు

నెల్లూరు (టౌన్): సమగ్రశిక్షలో పనిచేస్తున్న పలువురు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఏపీసీ ఉషారాణి శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గత 18 రోజులుగా తమ డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ పలువురు ఉద్యోగులు విధులకు గైర్హాజరువుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విధులకు గైర్హాజవుతున్న వారికి ఏపీసీ నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో రాత పూర్వకంగా వివరణ పంపాలని అందులో పేర్కొన్నారు. వివరణ సకాలంలో పంపకుంటే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుచ్చిరెడ్డిపాళెం, ముత్తుకూరుతో పాటు జిల్లాలోని పలు మండలాల్లో పనిచేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులకు షోకాజు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

హుండీ కానుకల లెక్కింపు

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నంలో ఉన్న చాముండేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారి హుండీ కానుకల లెక్కింపు శనివారం జరిగింది. ఇందులో రూ.6,30,312 రాబడి వచ్చిందని ఆలయ ఈఓ బండి శాంతయ్య తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి కె.సుధీర్, కెనరా బ్యాంక్ మేనేజర్ ఎం.శ్రీహరి పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ పరిధిలోని అల్లూరు కాలువ వద్ద శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి మద్యం బాటిళ్లతో పోలీసులకు దొరికాడు. వివరాలు..బుచ్చిరెడ్డిపాళెం మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన జడపల్లి కిష్టయ్య అల్లూరు కాలువ వద్ద పరిమితికి మించి మద్యం బాటిళ్లు కలిగి ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. అతని దగ్గర ఉన్న 17 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మహేంద్ర తెలిపారు.

ప్రతిష్టాత్మకంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ఉత్సవాలు



వెంకటేశ్వరపురం సచివాలయంలో పెన్షన్ నగదు అందజేస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): విజయవాడలో ఈ నెల 19న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తున్న సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాలను నగరంలో ప్రతిష్టాత్మకంగా జరపాలని కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ నెల 8న వీఆర్సీసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహంతో పాటు జిల్లా పరిధిలోని అన్ని అంబేడ్కర్ విగ్రహాలను సుందరీకరించి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించనున్నట్లు చెప్పారు. 9న నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్-సామాజిక న్యాయం' అనే అంశంపై జిల్లా స్థాయి సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. 10న జీఎన్‌టీ రోడ్డులోని ఎన్‌జీఓ హోంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. 11న ఆర్టీసీ బస్టాండ్, చిల్డ్రన్స్‌పార్కులో అంబేడ్కర్ ఫొటో ఎగ్జిబిషన్లు, డీకేడబ్ల్యూ కళాశాల ప్రాంగణంలో బీఆర్ అంబేడ్కర్-సామాజిక న్యాయం అనే అంశంపై జిల్లా స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.లక్ష, రూ.75 వేలు, రూ.50 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే పోటీలకు 16 నుంచి 18 ఏళ్ల లోపు విద్యార్థులు అర్హులన్నారు. 12న వీఆర్సీ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్మించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ నేతృత్వంలో జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

అంబేడ్కర్ విగ్రహ పరిశీలన

వీఆర్సీ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహాన్ని అధికారులతో కలిసి కమిషనర్ వికాస్‌మర్మత్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ఉత్సవాల సందర్భంగా నగరంలోని అన్ని అంబేడ్కర్ విగ్రహాల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలని, నూతన శోభను సంతరించుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ నెల 8న నగరంలోని అంబేడ్కర్ విగ్రహాలకు ప్రజలు పూలమాలలు వేసి నివాళులర్పించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. 9న కస్తూర్బా కళాక్షేత్రంలో నిర్వహించే సభకు ప్రజలను ఆహ్వానించాలని సూచించారు.

సచివాలయాల తనిఖీ

నగరంలోని 53/1 వెంకటేశ్వరపురం, 54/1, 2, 3 లంగర్‌తోట, జనార్దన్‌రెడ్డికాలనీ, బర్మాషెల్‌గుంట వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్‌మర్మత్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతన వైఎస్సార్ పెన్షన్ కానుకలతో పాటు పెంచిన పెన్షన్ మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేశారు. సచివాలయాల రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. పెండింగ్ సేవలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, సాంకేతిక అంశాలపై కార్పొరేషన్ కార్యాలయం నుంచి నేరుగా సూచనలు పొందాలని సూచించారు. ఏపీ సేవా పోర్టల్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి సూచించిన యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని కార్యదర్శులకు సూచించారు.



ఓటరు సవరణ దరఖాస్తులను పరిశీలిస్తున్న కమిషనర్

క్షేత్రస్థాయిలో ఓటరు సవరణ దరఖాస్తుల పరిశీలన

ఓటరు జాబితా సవరణకు వచ్చిన దరఖాస్తులను కమిషనర్ వికాస్‌మర్మత్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాలాజీనగర్, వెంకటేశ్వరపురం, విజయమహల్‌గేట్, సంతపేట తదితర ప్రాంతాల్లో పర్యటించి ఓటర్లతో నేరుగా మాట్లాడి వివరాలను తనిఖీ చేశారు. కమిషనర్ వెంట ఏఈఆర్వోలు, ఇతర ఎన్నికల విభాగ సిబ్బంది ఉన్నారు.

మాతాశిశు మరణాలను అరికట్టాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

నెల్లూరు సిటీ: జిల్లాలో మాతాశిశుమరణాలను అరికట్టేందుకు వైద్యారోగ్య సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య అన్నారు. నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మాతాశిశు మరణాలపై సబ్‌కమిటీ సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ గతేడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో జిల్లాలో జరిగిన 2 మాతృ, 16 శిశు మరణాలకు గల కారణాలను కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులను గుర్తించి క్రమం తప్పకుండా ప్రతి నెలా వైద్యపరీక్షలు చేయించుకునేలా చూడాలన్నారు. రక్తహీనతకు గురికాకుండా ప్రత్యేకంగా చికిత్స అందించాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు చేయించుకునేలా ప్రోత్సహించాలన్నారు. గర్భిణులు ఈసీజీ, అల్ట్రాసౌండ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా మాతాశిశు మరణాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. ఈ సమావేశంలో వైద్యులు రమేష్‌నాథ్, గీతాలక్ష్మి, రామచంద్ర, సెలీనాకుమారి, దయాకర్, బ్రిజిత, మంజుల, కనకరత్నం, తదితరులు పాల్గొన్నారు.

12,13న ఎస్టీయూ వజ్రోత్సవ వేడుకలు

నెల్లూరు (టౌన్): ఎస్టీయూ ఆవిర్భవించి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 12,13 తేదీల్లో కర్నూలులోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వజ్రోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజమనోహర్ తెలిపారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఎస్టీయూ వజ్రోత్సవ వేడుకల పోస్టర్లను డీఈఓ గంగాభవాని చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12న ఉదయం 10 గంటలకు కర్నూలులోని ధర్నా చౌక్ నుంచి 5వేల మంది ఉపాధ్యాయులతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో సభ నిర్వహించనున్నట్లు వివరించారు. ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి అశోక్‌బాబు, నాయకులు నరసింహం, వెంకటేశ్వర్లు, సుమన్, వెంకటసుబ్బయ్య, వెంకటరత్నం, కస్తూరయ్య, నారాయణరెడ్డి, రవీంద్ర, లక్షయ్య తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈఓ గంగాభవాని

డ్రైవర్లు, వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి

నెల్లూరు సిటీ: మినీ ట్రక్కుల డైవర్లు, వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీ న్యూ హెచ్‌ఎంసీ మినీట్రక్ ఓనర్స్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆసిఫ్‌బాషా పేర్కొన్నారు. నగరంలోని మైపాడుగేటు సెంటర్‌లోని చంద్రహాసిని మినీ ఫంక్షన్ హాల్లో ఏపీ న్యూ హెచ్‌ఎంసీ మినీట్రక్ ఓనర్స్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు, వర్కర్లకు ఏమైనా సమస్యలు ఉంటే నూతన అసోసియేషన్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో అసోసియేషన్‌ను బలోపేతం చేస్తామన్నారు. అసోసియేసన్ సభ్యులు ఉస్మాన్, శివ, మదన్‌మోహన్, కేఎస్ రాజా, షాహిద్, నాగూర్‌బాషా, సుబ్బారెడ్డి, షేక్ ఖాజావలి, వెంకటరమణయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సభ్యులకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న నాయకులు

అభివృద్ధిని చూడకుండా విమర్శలు తగవు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగర నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూడకుండానే విమర్శలు చేయడం మాజీ మంత్రి నారాయణకు తగదని కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యుడు షేక్ జమీర్ అన్నారు. 54వ డివిజన్ వెంకటేశ్వరపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల నగరంలోని 53, 54వ డివిజన్లలో పర్యటించిన నారాయణ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శలు చేశారన్నారు. ప్రజలకు ఏమీ చేయని నారాయణ ఈ విధంగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్ల పేరుతో పేదలను దోచుకుంది మీరు కాదా అని దుయ్యబట్టారు. తమ నాయకుడు, ఎమ్మెల్యే అనిల్ కుమార్ అటువంటి దరిద్రపు పనులు చేయలేదన్నారు. గడిచిన నాలుగేళ్లలో తమ డివిజన్‌లో రూ.60 కోట్లతో అభివృద్ధి పనులు చేశారని వివరించారు. 53,54 డివిజన్ల పరిధిలోని ప్రాంతాలు ముంపునకు గురికాకుండా పెన్నా నది ఒడ్డున రిటైనింగ్ వాల్ నిర్మించారని తెలిపారు. పెన్నానదిపై రెండో బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టారన్నారు. మైపాడు రోడ్డు విస్తరణ, ముత్తుకూరు రోడ్డు వద్ద ఫ్లైఓవర్, పెన్నా బ్యారేజీ, తదితర అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. అభివృద్ధి పనులు మీకు కనబడడం లేదాని నారాయణను ప్రశ్నించారు. కార్పొరేటర్ దేవరకొండ సుజాత, 54వ డివిజన్ ఇన్‌చార్జి షేక్ ముజీర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షేక్ జమీర్

గాయపడిన వృద్ధురాలి మృతి

నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాలు..జనార్దన్‌రెడ్డికాలనీకి చెందిన సులోచనమ్మ(68) శుక్రవారం రాత్రి సుమారు 10.30 గంటల ప్రాంతంలో భగత్‌సింగ్‌కాలనీ వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా కావలి వైపు నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సులోచనమ్మ కొద్దిసేపటికే మృతిచెందారు. ఈ మేరకు మృతురాలి కుమార్తె సునీత నార్తుట్రాఫిక్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. వృద్ధురాలి మృతదేహాన్ని నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివాజీ, ఎస్సై గీతారమ్య పరిశీలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

9న డయల్ యువర్ డీఎం

నెల్లూరు సిటీ: ఈ నెల 9న సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు నెల్లూరు-2 డిపో మేనేజర్ శివకేశవ్‌యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు డిపో-2 పరిధిలో ప్రజారవాణా వ్యవస్థ అభివృద్ధికి సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు సమస్యలను విన్నవించేందుకు ప్రయాణికులు 99592 25642 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వైఎంసీఏ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ కాంప్లెక్స్ ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్ రెడ్డి శనివారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని సోమశేఖరపురం, కాంప్లెక్స్‌రోడ్డు, పొగతోట, బృందావనం, గాంధీనగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (పొగతోట): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 143 వలంటీర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ ఎం హరినారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నెల్లూరురూరల్: నెల్లూరురూరల్ మండల పరిధిలోని సర్వేపల్లి కాలువ వద్ద జాతీయ రహదారిపై ఈ నెల 3న అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని నేషనల్ హైవే మొబైల్ వాహన సిబ్బంది నెల్లూరులోని జీజీహెచ్‌లో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మృతుడిని తిరుపతి జిల్లా కోట ప్రాంతానికి చెందిన ప్రసన్నకుమార్(40)గా పోలీసులు భావిస్తున్నారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి



మాట్లాడుతున్న ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి

- ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి

నెల్లూరు(పొగతోట): విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో, వసతి గృహాల్లో నాణ్యమైన ఆహారం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి అధికారులకు సూచించారు. శనివారం నెల్లూరులోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటించి పాఠశాలలు, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించామని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి హాస్టళ్లకు సకాలంలో రేషన్ సరఫరా చేయాలన్నారు. కోవూరు సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ వార్డెన్ జ్యోతిరాణి సక్రమంగా విధులకు హాజరుకాకుండా నిర్లక్ష్యం ఉంటున్నారని, ఆమెకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆ శాఖ డీడీని ఆదేశించారు. మెనూ పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్డుదారులకు వాహనాల ద్వారా రేషన్ సక్రమంగా అందించాలన్నారు. జిల్లా పర్యటనలో కొంతమంది అధికారులు మాత్రమే హాజరయ్యారని, అందరూ అధికారులు హాజరై ఉంటే సమస్యలను పూర్తిస్థాయిలో గుర్తించేవారమని తెలిపారు. ప్రొటోకాల్ పాటించడంలో విఫలమయ్యారని, ఈ విషయంపై రాష్ట్రస్థాయిలో జరిగే సమీక్ష సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. సమావేశంలో డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఎం పీవీ నరసింహారావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రమేష్, ఉషారాణి, అంకయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్రాంతికి 150 బస్సులు సిద్ధం

నెల్లూరు సిటీ: సంక్రాంతి పండగను పురస్కరించుకుని ప్రయాణికుల సౌకర్యార్థం ఏపీఎస్‌ఆర్టీసీ జిల్లా పరిధిలోని వివిధ డిపోల నుంచి ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు ప్రత్యేక బస్సులను సిద్ధం చేసినట్లు ఆర్ఎం శేషయ్య శనివారం తెలిపారు. చెన్నై నుంచి నెల్లూరుకు 12 బస్సులు, కర్నూలు నుంచి నెల్లూరుకు 6 బస్సులు, బెంగళూరు నుంచి నెల్లూరు, జిల్లాలోని ప్రధాన కేంద్రాలకు 30 బస్సులు, హైదరాబాద్ నుంచి నెల్లూరుకు 102 బస్సులను ఏర్పాటు చేశారు. మొత్తం 150 బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చారు.

సాధారణ చార్జీలే

పండగ సమయాల్లో గత ప్రభుత్వాలు ప్రయాణికులను చార్జీల రూపంలో దోపిడీ చేసేవి. ఇష్టమొచ్చినట్లు చార్జీ ధరలు పెంచేవారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పండగల సమయంలోనూ సాధారణ చార్జీలే వర్తింపజేస్తోంది. అంతేకాకుండా రాను, పోను రిజర్వేషన్ చేయించుకుంటే 10 శాతం రాయితీ కూడా ఇస్తుండడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏఎస్పీగా సౌజన్య బాధ్యతల స్వీకరణ



ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సౌజన్య

నెల్లూరు(క్రైమ్): జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన)గా సీహెచ్ సౌజన్య శనివారం పోలీసు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సౌజన్య 2012లో పోలీసుశాఖలో డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. అప్పాలో శిక్షణ అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని చేవెళ్ల, వికారాబాద్‌లలో ట్రెయినీ డీఎస్పీగా విధులు నిర్వహించారు. రాష్ట్ర విభజన అనంతరం ఆమెను ఏపీకి కేటాయించారు. తెనాలి, గుంటూరు క్రైమ్స్, ఇంటిలిజెన్స్ డీఎస్పీగా పనిచేశారు. రాజమహేంద్రవరం ఏసీబీ డీఎస్పీగా విధులు నిర్వహిస్తూ 2021లో ఏఎస్పీగా పదోన్నతి పొంది అక్కడే ఏసీబీలో కొనసాగుతున్నారు. గత నెల 15వ తేదీన జరిగిన ఏఎస్పీల బదిలీల్లో ఆమె జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన)గా నియమితులయ్యారు. ఏఎస్పీ (క్రైమ్స్) ప్రసాద్, మినిస్టీరియల్ సిబ్బంది, సివిల్, ఏఆర్, హోమ్‌గార్డ్స్, దిశ, డీసీఆర్‌బీ, డీటీసీ, ఎస్‌బీ తదితర విభాగాల అధికారులు, సిబ్బంది నూతన ఏఎస్పీని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామికి విశేష పూజలు



నెల్లూరురూరల్: రూరల్ మండలం నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. శ్రీవారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని విశేషాభిషేకాలు, తిరుప్పావై సేవ నిర్వహించారు.

ఆలూరుకు పూర్ణకుంభ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ఆలూరు శిరోమణిశర్మ

నెల్లూరు(బారకాసు): నెల్లూరుకు చెందిన ఆలూరు శిరోమణిశర్మ పూర్ణకుంభ పురస్కారాన్ని అందుకున్నారు. రాజమహేంద్రవరంలో ఈ నెల 5న 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభల సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. తాను రచించిన పద్య కవితలు చదివి వినిపించి ప్రశంసలు అందుకున్నారు. దీంతో తెలుగు మహాసభల నిర్వాహకులు గజల్ శ్రీనివాస్, చైతన్యరాజు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి బీ కృష్ణమోహన్ చేతుల మీదుగా శిరోమణిశర్మకు పూర్ణకుంభ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరుకు చెందిన బొగ్గవరపు శ్రీమన్నారాయణ, పంచాక్షరి బ్రాహ్మణజాగృతి సంస్థ అధ్యక్షుడు శింగరాజు భవానిప్రసాద్ పాల్గొన్నారు.

ఆత్మకూరు అభివృద్ధికి ప్రణాళికలు

నెల్లూరు(దర్గామిట్ట): ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనల మేరకు ఆత్మకూరు నియోజకవర్గంలో పర్యాటక అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేసేందుకు ఆత్మకూరు, ఏఎస్‌పేటలో జనా అర్బన్ స్పేస్ డైరెక్టర్ నిత్య, ఆర్కిటెక్ట్ ప్రవల్లిక గత రెండ్రోజుల పాటు నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఆత్మకూరులో రోడ్లు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాల ద్వారా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆత్మకూరు బైపాస్‌రోడ్డులోని హనుమాన్ జంక్షన్ నుంచి మెయిన్ బజార్ వరకు మెయిన్ రోడ్డు, పట్టణంలో వ్యాపారుల కేంద్రంగా ఉన్న వైశ్యబజార్ ప్రాంతాలను పరిశీలించి ఆకర్షణీయంగా మార్చేందుకు చేపట్టాల్సిన మౌలిక వసతుల కల్పనపై నాయకులతో చర్చించారు. అనంతరం ఆత్మకూరు చెరువును పరిశీలించిన నిపుణుల బృందానికి గతంలో ఉన్న ప్రతిపాదనలను పట్టణ నాయకులు వివరించారు. అనంతరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఏఎస్‌పేట దర్గాలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాను సందర్శించారు. దర్గా పరిసరాలను పరిశీలించి భక్తుల రద్దీకి అనుగుణంగా పర్యాటక అభివృద్ధితో పాటు వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల ప్రణాళికలను నెలరోజుల్లోపు సిద్ధం చేసి అందించాలని వారికి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి సూచించారు.



జనా అర్బన్ స్పేస్ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి